మహబూబ్‌నగర్

వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

# పేదలకు అండగా నిలిచేందుకే బీఆర్ఎస్

- ప్రశ్నించే గొంతులను అణచివేసేందుకు కుట్ర
- పాలమూరుకు జాతీయ హోదా ఏమైంది?
- కులం,మతం పేరిట రెచ్చగొడుతున్నరు
- బాగుపడుతున్న రాష్ట్రాన్ని కల్లోలం చేస్తున్నరు
- నిజాయితీగా పని చేస్తే పార్టీలో గుర్తింపు
- ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, జనవరి17, ప్రభాతవార్త:** దేశంలో ప్రశ్నించే గొంతులను అణచివేసేందుకు కుట్ర జరుగుతుందని, దేశాన్ని పాలించే విధానం, విధానాలపై విమర్శలు చేసే వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. మహబూబ్‌నగర్‌లోని జేజేఆర్ ఫంక్షన్ హాల్‌లో మహబూబ్‌నగర్ పట్టణ, రూరల్ మండల పరిధిలోని ముఖ్య కార్యకర్తలు, వార్డు ఇన్‌చార్జుల సమావేశానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. వివిధ సంక్షేమ పథకాలతో తెలంగాణ ప్రజలకు అండగా నిలిచి రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్‌గా నిలిపిన విధంగా దేశం మొత్తం అండగా నిలిచేందుకు సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ ను స్థాపించారన్నారు. బీఆర్ఎస్ పార్టీ విధానాలకు దేశం మొత్తం తెలియజేసేందుకు మంగళవారం ఖమ్మంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసినట్లు


ఓ అభిమాని బహూకరించిన గదతో మంత్రి శ్రీనివాస్‌గౌడ్

తెలిపారు. నిజాయితీగా ఉండే వారికి పార్టీలో గుర్తింపు ఉంటుందని, వార్డు ఇన్‌చార్జిలు పెద్దన్న పాత్ర పోషించి స్థానికులకు సేవలందించాలన్నారు. 2014 ఎన్నికల సందర్భంగా పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇస్తామని హామీ ఇచ్చిన మోడీ ఎన్నికల తర్వాత ఆ విషయాన్ని మర్చిపోయారని, కనీసం ఆ విషయాన్ని కనీసం ఎక్కడా ప్రస్తావించకపోవడం ఆలోచించాలన్నారు. రెండు సార్లు ప్రధానిగా చేసి కనీసం ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదని , తెలంగాణకు పాలమూరుకు ఇక ఏం న్యాయం చేస్తారని ప్రశ్నించారు. కులం, మతం పేరిట ప్రజలను మభ్య పెట్టేందుకే రెచ్చగొడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ఎక్కడ ఎన్నికలుంటే అక్కడ మతకలహాలకు గురి చేస్తూ గెలిచేందుకు కుట్ర చేస్తారనివిమర్శించారు. తెలంగాణలో అమలు చేస్తున్న పథకాలు, సంక్షేమం,అభివృద్ధి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా అమలు చేస్తున్నారో చెప్పాలన్నారు. కార్యక్రమంలో మైనార్టీ కార్పొరేషన్ ఇంతియాజ్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు గోపాల్‌యాదవ్, మున్సిపల్ చైర్మన్ నర్సింహులు ముడాచైర్మన్‌గంజి వెంకన్న,డీసీసీబీ వైస్ చైర్మన్ వెంకటయ్య, గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శాంతన్న యాదవ్,బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు శివరాజు, ప్రధాన కార్యదర్శి వినోద్, మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, ఎంపీపీ సుధాశ్రీ, జెడ్పీటీసీ వెంకటేశ్వరమ్మ, కౌన్సిలర్లు,సర్పంచులు, ఎంపీటీసీలు నాయకులు పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

# కంటి వెలుగు వైద్య శిబిరాలలో అన్ని సౌకర్యాలు ఉండాలి

- మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావు


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 17 ప్రభాతవార్త :** ఈనెల 19 నుండి నిర్వహించనున్న రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమానికి గుర్తించిన కంటి వెలుగు శిబిరాలలో ప్రభుత్వం ఆదేశించిన ప్రకారం సౌకర్యాలు ఉండాలని జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావు అన్నారు. మంగళవారం ఆయన మహబూబ్‌నగర్ మున్సిపల్ పరిధిలోని ఏనుగొండ బస్తీ దవాఖానలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు వైద్య శిబిరంలో మాక్ డ్రిల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య శిబిరానికి కంటి పరీక్ష కోసం వచ్చినవారు ముందుగా విచారణ, సమాచార సేకరణ టేబుల్ నుండి మొదలుకొని కంటి వెలుగు వైద్యాధికారితో పరీక్ష చేయించుకునే టేబుల్, యంత్ర పరికరం ద్వారా కంటి చూపు స్థాయిని తెలుపుకోవడం, అదేవిధంగా సైట్‌కు సంబంధించిన అద్దాల ద్వారా వారి కంటిచూపు సామర్థ్యాన్ని పరీక్షించుకోవడం, అనంతరం మందుల చీటీ తీసుకున్న తర్వాత కళ్లద్దాల పంపిణీ వంటి అన్ని టేబుల్‌లను తనిఖీ చేయడమే కాకుండా, వైద్య సిబ్బందితో వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కేంద్రానికి వచ్చిన ఒకరిద్దరి ఆధార్ కార్డు నంబర్ల ఆధారంగా కంటి వెలుగులో కంటి వైద్య పరీక్షల నిమిత్తం ప్రక్రియను దగ్గరుండి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లో కంటి పరీక్ష వైద్య శిబిరాలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని, ఇది పూర్తిగా నిర్వాహకులపై ఆధారపడిందని తెలిపారు. అంతేకాక స్థానిక ప్రజాప్రతినిధులు కూడా ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. దీనివల్ల కంటి వెలుగు వైద్య శిబిరాలు విజయవంతంగా నిర్వహించేందుకు అవకాశం ఉందని ఆయన వెల్లడించారు. కంటి వెలుగు పరీక్షలు సక్రమంగా నిర్వహించేందుకు వైద్యులు, ఎఎన్ఎంతో సహా ఆశ, అంగన్‌వాడి తదితర కార్యకర్తలందరు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండాలని వైద్యారోగ్యశాఖ అధికారులను ఆదేశించారు.కంటి వెలుగు వైద్య శిబిరాలకు వచ్చేవారు తప్పనిసరిగా ఆధార్, సెల్ ఫోన్ నంబర్‌తో సహా రావాలని కోరారు. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా.కృష్ణ, డా. శశికాంత్, కంటి వెలుగు ప్రోగ్రాం అధికారి మోతిలాల్, డా. రఫీ తదితరులు ఉన్నారు.

# యువశక్తి ఫౌండేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎంపిపి

**పెద్దమందడి, జనవరి 17 ప్రభాతవార్త:** రాష్ట్రంలో యువశక్తి ఫౌండేషన్ చేస్తున్న సేవలు అద్భుతమని పెద్దమందడి ఎంపిపి తూడి మెగారెడ్డి అన్నారు. మంగళవారం పెద్దమందడి కేంద్రం గ్రామం జంగమాయిపల్లి,కొములగట్టు వెంకటేశ్వరస్వామి ఆలయం సన్నిధానంలో పెద్దమదడి ఎంపిపి తూడి మెగారెడ్డి యువశక్తి ఫౌండేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అతి తక్కువ కాలంలో ఎంతో మంది గర్భిణీ స్త్రీలకు, తలసేమియా చిన్నారులకు, డెంగ్యూతో బాధపడేవారికి, ఆపదలో ఉన్న వారికి రాష్ట్ర వ్యాప్తంగా రక్తదానం చేయడమే కాకుండా, పేద విద్యార్థులకు చదువు విషయంలో ప్రోత్సాహం ఇచ్చి ఎంతోమంది జీవితాలలో వెలుగులు నింపుతున్న యువశక్తి ఫౌండేషన్ సభ్యులను మెగారెడ్డి అభినందించారు. నిదుర లేవండి యువత మీరే ఈ దేశానికి భవిత, కదిలి రండి కదిలి రండి,రహదారులలో రక్తాన్ని చిందించకండి, ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేయండి, ఎంత దానం చేసినా తరగని ఆస్తి రక్తదానం అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి తూడు మెగారెడ్డి, యువశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కాగితాల మధు, ఫౌండేషన్ స్టేట్ ప్రెసిడెంట్ నరేష్ యాదవ్, జనరల్ సెక్రెటరీ మోహన్, స్టేట్‌వైస్ ప్రెసిడెంట్ మణికంఠ,గణేష్,


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న పెద్దమందడి ఎంపిపి తూడి మెగారెడ్డి

శంకర్, రఘు, హేమంత్, నాగరాజు, రాజేష్, రాఘవేందర్, గణేష్ సభ్యులు పాల్గొన్నారు.

# కంటి వెలుగుకు సర్పంచ్‌ల గుడ్‌బై..

- ప్రభుత్వ కార్యక్రమానికి సుముఖత చూపని సర్పంచ్‌లు


సమావేశానికి హజరు కాని సర్పంచ్‌లతో ఖాళీగా దర్శనమిస్తున్న కూర్చీలు, సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ భీమమ్మ

**వంగూరు, జనవరి 17, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం అంధత్వాన్ని నివారిస్తూ ప్రజలకు వెలుగులు నింపేందుకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పలు శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినప్పటికి వంగూరు మండలంలో మాత్రం ప్రభుత్వ ఉత్తర్వులకు విరుద్ధంగా గ్రామ ప్రథమ పౌరులు గుడ్‌బై చెప్పారు. స్థానికంగా ఏర్పడిన కొన్ని సమస్యల వల్ల గ్రామ ప్రథమ పౌరులు గ్రామాల్లో నిర్వహించిన పనులకు బిల్లులు రాకపోవడం వల్ల, సర్పంచ్‌లకు గౌరవం దక్కకపోవడం వల్ల ముక్కుమ్మడిగా సర్పంచ్‌లు అధికారులు నిర్వహించిన సమావేశాన్ని బహిష్కరించారు. వంగూరు మండల కేంద్రంలోని రైతు వేధికలో ఎంపీపీ భీమమ్మ అధ్యక్షతన నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమానికి పలు శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు హజరై బుధవారం నుంచి కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయాల్సి ఉండగా గ్రామ ప్రథమ పౌరులు మాత్రం ఈ సమావేశానికి హజరు కాకపోవడం విశేషంగా మారింది. గ్రామాల్లో ప్రభుత్వం నిర్వహించే కంటి వెలుగు కార్యక్రమం విజయవంతం కావాలన్న, వచ్చిన అధికారులకు, వైద్య సిబ్బందికి అన్ని ఏర్పాట్లు చేయాలన్న గ్రామ సర్పంచ్‌లదే బాధ్యత. కానీ సర్పంచ్‌లకు, మండల అధికారులకు, మండల ప్రజా ప్రతినిధులకు సమన్వయ లోపం ఏర్పడటం వల్లనే పాలన, ప్రతిపక్ష సర్పంచ్‌లు గైర్హాజరై సమావేశ మందిర సమీపానికి రాకపోవడం శోచనీయంగా మారింది. గ్రామ సర్పంచ్‌లే సమావేశాలకు హజరు కాకపోతే గ్రామాల్లో నిర్వహించే కంటి వెలుగు కార్యక్రమం ఎలా విజయవంతమవుతుందని పలువురు చర్చించుకుంటున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధుల సమన్వయ లోపం వల్ల ప్రభుత్వం అందించే ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందుతాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామాలకు సర్పంచ్‌లు కీలకం కావడం వల్ల బయటి నుంచి వచ్చిన అధికారులకు ఏర్పాట్లు చేస్తారా, ప్రజలు సహకరిస్తారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## కొనసాగిన క్యాటగిరి బండలాగుడు పోటీలు

**ఇటిక్యాల, జనవరి 17 ప్రభాతవార్త:** మండల పరిధిలోని వావిలాల గ్రామంలో వెలసిన శ్రీ శివాంజనేయ స్వామి జాతర బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం క్యాటగిరి బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన ఐదుమంది విజేతలను ఎంపిక చేసిఒ బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి నంద్యాల జిల్లా పెద్దకొట్టాల గ్రామానికి చెందిన శేఖర్‌రెడ్డి యజమానికి చెందిన ఎద్దుల జతకు మొదటి బహుమతి రూ. 50 వేలు, రెండవ బహుమతి కర్ణాటక పల్కందొడ్డి గ్రామానికి చెందిన ఖాజాహుస్సేన్ యజమానికి చెందిన ఎద్దుల జతకు రెండవ బహుమతి 40 వేల రూపాయలు, మూడో బహుమతి కర్నూలు జిల్లా కల్లూరు గ్రామానికి చెందిన రవింద్రనాథ్‌శర్మ యజమాని ఎద్దులజతకు మూడో బహుమతి 30 వేల రూపాయలు, నాలుగో బహుమతి కర్నూలు జిల్లా, పెద్దపాడు గ్రామానికి చెందిన భీముడు యజమాని ఎద్దుల జతకు నాలుగో బహుమతి 20 వేల రూపాయలు, ఐదవ బహుమతి కర్నూలు జిల్లా సింగవరం గ్రామానికి చెందిన హర్షిని యజమానికి చెందిన ఎద్దుల జతకు ఐదవ బహుమతి కింద పదివేల రూపాయల బహుమతులను అందజేశారు. విజేతలకు శ్రీ శివాంజనేయ కమిటి ఆధ్వర్యంలో బహుమతులు వారికి అందజేశారు.



మన ఊరు మనబడి కార్యక్రమం ద్వారా సూచించిన..

# పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలి

- గద్వాల జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 17 ప్రభాతవార్త:** మన ఊరు మన బడి కార్యక్రమం కింద మంజూరైన నిధులతో 24 మాడల్ పాఠశాలలో చేపట్టిన మేజర్, మైనర్ నిర్మాణ పనులు, ఇజిఎస్ పనులను పూర్తిచేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ హాలులో పంచాయతీరాజ్ ఎస్ఈ, డిఇలు, ఏఈల పల్లె దవాఖానాలు, అంగన్‌వాడి, విద్యాశాఖ అధికారులతో సమక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు మన ఊరు మన బడి కార్యక్రమం ద్వారా సూచించిన పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మన ఊరు మనబడి కార్యక్రమం కింద జిల్లాలో ఎంపికైన పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణం, అదనపు గదులు, డ్రింకింగ్ వాటర్, విద్యుత్ పనులు వెంటనే పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాలలో ఎక్కడైనా పనులు పెండింగ్‌లో ఉన్నాయో అక్కడ మేజర్, మైనర్ రిపేరు పనులు పూర్తి చేయించాలని అన్నారు. మండలాల వారిగా సమీక్షించారు. మండలలలోని జడ్పీ హైస్కూల్లో, ప్రాథమిక పాఠశాలలో మరుగుదొడ్లు, అదనపు గదుల నిర్మాణం పనులు పూర్తి ప్రోగ్రెస్‌లోకి రావాలని, జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో పనులు జరిగినవి అప్‌లోడ్ చేయాలన్నారు. కస్తూర్బా పాఠశాలలో కంపౌండ్ వాల్, మరుగుదొడ్లు, ఇతర సదుపాయాలు పర్యవేక్షించి మొదలు పెట్టిన పనులు పూర్తి చేయాలని, జిల్లాలో హెల్త్ సబ్ సెంటర్ల పనులు, మన ఊరు మనబడి కింద చేపట్టిన పనులు మార్చి చివరి నాటికి పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గ్రామాలలో చేపట్టిన బస్తీ దవాఖానాలు (పిహెచ్‌సి)లు పనులుఎంతవరకు వచ్చా యని డెమో ద్వారా వాటికి సంబంధించిన ఫోటోలు, స్కూల్స్ కలర్ కు సంబంధించిన ఫోటోలు చూశారు.అన్ని గ్రామాలలో పిహెచ్‌సి పనులు


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్

ముమ్మరం చేసి పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదే శించారు. పల్లె దవాఖానాల పనులు పూర్తిచేసి కలరింగ్ చేసి, ప్రారం బానికి సిద్ధం చేయాలన్నారు. ఈ సందర్భంగా పల్లె దవాఖాన గురించి పెండింగ్‌లో ఉన్న పనులు,పూర్తి చేసిన పనులకు సంబంధించిన వివరాలు ఎప్పటికప్పుడు నివేదికలు, సంబంధించిన ఫోటోలు పంపాలన్నారు. జిల్లాలో సబ్ సెంటర్లు, పెండింగ్ ఉన్నవాటిని పూర్తి చేయాలన్నారు. సబ్ సెంటర్ వారిగా పూర్తిచేసిన లిస్టు, విజిట్ చేసిన ఫోటోలు పంపించాలన్నారు. ప్రతి గ్రామాలలో ఉన్న సబ్ సెంటర్‌ల పనులను త్వరగా పూర్తి చేయాలని ఏఈలను ఆదేశించారు. హెల్త్ సబ్ సెంటర్లు మొదలు పెట్టిన వాటిని పూర్తిచేసి త్వరగా వాడుకలోకి తీసుకురావాలని అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఎంపికైన పాఠశాలలో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండే విధంగా మొక్కలు నాటించాలని, పెయింటింగ్, పాత్‌వే పనులు సర్పంచ్‌లతో మాట్లాడి త్వరగా పూర్తయ్యే విధంగా చూడాలని అన్నారు. ఆయుర్వేద డిస్పెన్సరీకి సంబంధించి సూర్య నమస్కారాలు, యోగ చిత్రీకరణలను గోడలపై పెయింటింగ్ వేయించాలని అన్నారు. పిహెచ్‌సిలలో కంపౌండ్ వాల్స్‌ను త్వరగా పూర్తి చేయాలని అన్నారు. నిర్మాణ పనులలో అలసత్వం వహించరాదని స్కూల్ వారిగా పనులు పూర్తిచేసి ఆన్‌లైన్ రికార్డు నమోదు చేయాలన్నారు. జిల్లాలో ఉన్న కెజిబివి పాఠశాలలో పెండింగ్ పనులను పర్యవేక్షించాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్, ఎస్ఈ శివకుమార్, డిఎంఅండ్‌హెచ్‌ఓ శశికళ, డిఇ రవిందర్, సిపిఓ లక్ష్మణ్,డిఇలు, ఏఈలు, ఉద్యానవనశాఖ అధికారి అర్బర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కంటి వెలుగు కార్యక్రమ ప్రణాళిక ప్రతి ఒక్కరికి తెలియాలి

- రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి : నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్


వైద్య బృందాలకు కొత్త సిమ్‌కార్డులను అందజేస్తున్న కలెక్టర్, మున్సిపల్ చైర్మన్

**కల్వకుర్తి, జనవరి 17, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమం ప్రణాళిక ప్రజలకు తెలిసే విధంగా విస్తృత ప్రచారం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి. ఉదయ్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం కల్వకుర్తి మున్సిపల్ కార్యాలయ సమావేశ హాల్‌లో కల్వకుర్తి రెవెన్యూ డివిజన్ పరిధిలో మొదటి 15 రోజుల పాటు నిర్వహించనున్న కంటి వెలుగు బృందాలు, ఆయా శాఖల అధికారులతో సన్నద్ధతపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఒక్కో బృందాన్ని లేపి తమ బృందంలో ఏ సభ్యులు ఎలాంటి సన్నద్ధత చేస్తున్నారు, కంటి పరీక్షల యంత్రాలు అన్ని వచ్చాయా, ప్రజలకు తెలిసే విధంగా ఎలాంటి ప్రచారం నిర్వహించారు, ఏ రోజు ఎవరు క్యాంపుకు రావాలనే అనే విషయాలు ప్రజలకు తెలుసా అని ప్రశ్నించారు. కల్వకుర్తి డివిజన్ పరిధిలో 78 ప్రాంతాలను ఏర్పాటు చేసి ఏ బృందం ఎప్పుడు ఎక్కడ ఎన్ని రోజులు క్యాంపు నిర్వహించాలి అనే ప్రణాళిక సిద్ధం చేసి రెండు వారాల ముందే ఇచ్చామన్నారు. ఆ ప్రణాళికను ప్రజలకు స్పష్టంగా ముందే తెలిసే విధంగా చూడాలన్నారు. పంచాయతీరాజ్, ఆరోగ్య శాఖ, రెవెన్యూ శాఖల సమన్వయంతో పనిచేసి కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ప్రతి రోజు ఉదయం 9గంటలకు కంటి వెలుగు వైద్య శిబిరం ప్రారంభం కావాలని,అందుకు సంబంధించిన ఫోటో ప్రతి బృందం 9 గంటలకు వాట్సాప్ చేయాల్సి ఉంటుందన్నారు. వాట్సాప్ గ్రూపులు వాడటానికి బృందాలకు కొత్త నెంబర్లు అందించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మనుచౌదరి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సుధాకర్‌లాల్, డీపీఓ కృష్ణ, మున్సిపల్ చైర్మన్ ఎద్మ సత్యం, ఆర్డీఓ రాజేష్‌కుమార్, మున్సిపల్ కమీషనర్ ఆశ్రిత్‌కుమార్, అప్తాలమాలజీలు, సూపర్‌వైజర్లు, ఎఎన్ఎంలు, పంచాయతీ సెక్రటరిలు, ఆశాలు తదితరులు ఉన్నారు.


సమీక్షా సమావేశానికి హజరైన రెవెన్యూ డివిజన్ అధికారులు, ఆయా శాఖల అధికారులు

# 'సంక్షేమ' వలసలు

- అభివృద్ధి, సంక్షేమాన్ని చేసే బీఆర్ఎస్‌లోకి
- ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 17 ప్రభాతవార్త:** పార్టీ ఆధ్వర్యంలో చేస్తున్న అభివృద్ధి సంక్షేమ విధానాలు, పథకాలను చూసే బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. మహబూబ్‌నగర్‌లోని జేజేఆర్ ఫంక్షన్ హాల్‌లో మహబూబ్‌నగర్ రూరల్ మండలం ధర్మాపూర్‌కు చెందిన బీజేపీ సీనియర్‌నాయకుడు నర్వబాల్‌రెడ్డి,రామిరెడ్డి, రాఘువేందర్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, బండమీదిపల్లి చెన్నయ్యరెడ్డి,భూత్పూర్ రాకేశ్‌రెడ్డితో కలిపి 100మందికి పైగా బీఆర్ఎస్‌లో చేరారు. ఎంపీటీసీ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, డీసీసీబీ వైస్ చైర్మన్ వెంకటయ్య, గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శాంతన్నయాదవ్, మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, ఎంపీపీ సుధాశ్రీ, జెడ్పీటీసీ వెంకటేశ్వరమ్మ, కౌన్సిలర్లు,సర్పంచులు, ఎంపీటీసీలు నాయకులు పాల్గొన్నారు.

## 34వ జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలు

**అడ్డాకుల, జనవరి 17 ప్రభాతవార్త :** భారత జాతీయ రహదారి నిర్వహణ సంస్థ ఆదేశాల మేరకు ఈనెల 11 నుంచి 17 వరకు వారం రోజుల పాటు 34వ జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించే కార్యక్రమంలో 7వ రోజులో భాగంగా మంగళవారం అడ్డాకుల మండలం శాఖాపూర్ టోల్‌ప్లాజా దగ్గర వాహనదారులకు ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ శిబిరానికి మహబూబ్‌నగర్ నుండి కంటి వైద్య నిపుణులు డా. అరుణ్ పాల్గొన్నారు. చికిత్స అనంతరం డ్రైవర్లకు ఉచితంగా వారికి అద్దాలను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అడ్డాకుల మండల తహసిల్దార్ కిషన్ పాల్గొన్నారు. అలాగే మహబూబ్‌నగర్ ఆర్టీఏ మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ నరేష్ వాహనదారులకు వాహనాలు నడిపేటప్పుడు సీట్ బెల్టు ధరించాలని సీట్‌బెల్టుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టోల్‌ప్లాజా సిబ్బంది ప్రాజెక్టు హెడ్ మదన్‌మోహన్, ఆపరేషన్స్ మేనేజర్ సంతోష్, రూట్ ఆఫీసర్ రాకేష్‌గౌడ్, తేజ ప్రెటోలింగ్ టీం పాల్గొన్నారు. వాహనదారులకు లారీ డ్రైవర్లకు తగు సూచనలు, భద్రత నియమాలను వివరించారు. 34వ జాతీయ భద్రత వారోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను వారికి అందించారు.

## హత్య కేసులో ఇద్దరు నిందితులకు రిమాండ్

**బిజినేపల్లి, జనవరి 17 ప్రభాతవార్త:** మండలంలోని వట్టెం గ్రామంలో ఇద్దరితో అక్రమ సంబంధం పెట్టుకున్న కృష్ణమ్మ నిత్యం వేధిస్తున్న ఒక ప్రియుడు రవికుమార్ అడ్డు తొలగించుకునేందుకు నిందితురాలు కృష్ణమ్మ, మరో ప్రియుడు శ్రీనివాసులుతో కలిసి హత్య చేశారు. హత్యకు పాల్పడిన వీరిని మంగళవారం రిమాండ్ చేసినట్లు సిఐ జక్కుల హనుమంతు, ఎస్సై కృష్ణ ఓబుల్‌రెడ్డి తెలిపారు. జడ్చర్లకు చెందిన సుంకసారి శ్రీనివాసులుతో కొనసాగిస్తున్న అక్రమ సంబంధానికి అడ్డు వస్తున్నాడని మద్యం మత్తులో ఉన్న మృతుడు రవికుమార్ తలపై బండరాయితో బలంగా కొట్టి హత్య చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయారు. నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు హత్యానేరం కేసు నమోదు చేసి వారిని రిమాండ్‌కు తరలించినట్లు వారు తెలిపారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



**మూసాపేట, జనవరి 17 ప్రభాతవార్త :** మూసాపేట మండలం నిజాలాపూర్ గ్రామంలో నిజాలపూర్ గ్రామానికి చెందిన వెంకటయ్య తండ్రి రాములుకు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి వచ్చిన రూ. 48 వేల చెక్కును దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి ఇంద్రయ్యసాగర్, మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మి నరసింహయాదవ్, కొండయ్య, రవిందర్‌గౌడ్, రఘుపతిరెడ్డి, రాము తదితరులు పాల్గొన్నారు.

## టెక్నికల్ కోర్సు పరీక్షల షెడ్యూల్ విడుదల

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, జనవరి17, ప్రభాతవార్త:** జిల్లాలో టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సుకు సంబంధించి 2021లో నమోదు చేసుకున్న అభ్యర్థులకు సంబంధించిన పరీక్షల తేదీలు ఖరారైనట్లు డీఈవో రవీందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లాలో నాలుగు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈమేరకు ఫిబ్రవరి 11 శనివారం నుంచి 14మంగళవారం పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షల తేదీ, సమయం, హాల్‌టికెట్లు ఇతర వివరాలు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.తెలంగాణ,జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

## అంత్యక్రియలకు ఆర్థికసాయం అందజేత



**బిజినేపల్లి జనవరి 17 ప్రభాతవార్త :** మండలంలోని మహదేవునిపేట గ్రామానికి చెందిన బోయ చెన్నయ్య ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడి మృతి చెందాడు. నిరుపేద కుటుంబమైన మృతుడి కుటుంబ సభ్యులకు అంత్యక్రియలు చేసే పరిస్థితి లేకపోవడంతో మంగళవారం గ్రామ సర్పంచ్ ఎద్దుల కళ్యాణి రాజేందర్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డిల సహకారంతో రూ.5 వేల తక్షణ ఆర్థిక సాయం అందజేశారు. అంతేకాకుండా బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉండి ఆదుకుంటామని సర్పంచ్ కళ్యాణి రాజేందర్‌రెడ్డి హామీ ఇచ్చారు కుటుంబాన్ని పరామర్శించిన వారిలో జుర్రు కృష్ణ తదితరులు ఉన్నారు.

## అంబేద్కర్ కళాభవన్ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

**రాజాపూర్, జనవరి 17 ప్రభాతవార్త :** జడ్చర్లలో నిర్మాణం జరుగుతున్న అంబేద్కర్ కళాభవనం పనులను త్వరగా పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి చేతుల మీద ఏప్రిల్ 14 అంబేద్కర్ జయంతి ప్రారంభోత్సవం చేయడం జరుగుతుందని జడ్పీ వైస్ చైర్మన్ అన్నారు. అందుకు మిగిలిన అన్ని పనులు త్వరలో పూర్తి చేయాలని డిప్యూటి పిఆర్ హీర్యానాయక్‌కు తెలిపారు. మార్కెట్ డైరెక్టర్ కె.నాగరాజు, మున్సిపల్ కౌన్సిలర్లు శశికాంత్, చైతన్య,రమేష్, ఏఈజెఆర్ బాబులు అన్నారు.



అంబేద్కర్ కళాభవన్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న దృశ్యం

# గెలవాలనే పట్టుదల ప్రతి ఒక్కరిలో ఉండాలి

- దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి



క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌ను ఆడి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆల

**మూసాపేట, జనవరి 17 ప్రభాతవార్త:** మూసపేట్ మండల పరిధిలో నిజలాపూర్ గ్రామంలో గత నాలుగు రోజుల నుండి నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం ఫైనల్ మ్యాచ్ సందర్భంగా ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి హాజరై ఫైనల్ మ్యాచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ గత నాలుగు రోజుల నుండి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్న నిర్వాహకులకు సహకరించిన ప్రతి ఒక్కరికి పేరు పేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఫైనల్ వరకు చేరిన అమిస్తాపూర్, జానంపేట జట్లను ప్రత్యేకంగా అభినందిస్తున్నానని తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో 26 టీమ్‌లు పాల్గొనగా గెలిచేది ఒకేటి టీం అని గెలవాలనే తపన ప్రతి ఒక్కరిలో ఉండాలని పట్టుదల ఉండాలని తగ్గట్లు కష్టపడాలని తెలిపారు. ఓడిపోయిన వారు నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని లక్ష్యాన్ని చేరేవరకు కష్టపడాలని తెలిపారు. నిజాలపూర్ గ్రామం ఆదర్శ గ్రామం కావడానికి యువకులు, మహిళా సంఘాల నాయకులు ప్రతి ఒక్కరు కష్టపడ్డారని తెలిపారు. గతంలో జాతీయ స్థాయిలో అవార్డు రావడం గ్రామానికి గర్వించదగ్గ విషయమని తెలిపారు. ఈ గ్రామంలో ఒక ఊరే కొత్తగా తయారయ్యే విధంగా డబుల్ బెడ్‌రూంలు ఏర్పాటు చేసుకున్నామని, సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. రెండు పంటలకు నీరు వచ్చే విధంగా చెక్ డ్యాంలు ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. ప్రత్యేకంగా యువకులను కోరేదొకటే పోరాట స్ఫూర్తి ప్రతి ఒక్కరిలో ఉండాలని సామాజిక కార్యక్రమంలో యువత ముందుండాలని తెలిపారు. చెడుకు బానిస కాకుండా యువత సమాజానికి పనికొచ్చే వివిధ కార్యక్రమాలు చేపట్టాలని యువతకు ఎలాంటి సహాయ సహకారాలు కావాలంటే అందించడంలో ముందుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి ఇంద్రయ్యసాగర్, మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మి నరసింహ యాదవ్, ఎంపిటిసి సిజి గోవర్ధన్, రైతు అధ్యక్షులు మల్లన్న, కొండయ్య, రఘుపతిరెడ్డి, వివిధ గ్రామాల యువకులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సంక్షేమం, అభివృద్ధి, ఆరోగ్యాన్ని కాపాడుతాం!

-కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

**వెల్దండ, జనవరి 17 ప్రభాతవార్త:** నియోజకవర్గ ప్రజల సంక్షేమం, గ్రామాలాభివృద్ధి, ప్రజా ఆరోగ్యాన్ని కాపాడుతామని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. వెల్దండ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ విజయ జైపాల్‌నాయక్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పర్చడానికి కంకణం కట్టుకున్నారని, సీఎం కేసీఆర్‌ను ఒప్పించి నియోజకవర్గానికి అధిక మొత్తంలో నిధులు తీసుకొస్తున్నట్లు తెలిపారు. ఈజీఎస్ పథకం క్రింద కల్వకుర్తి నియోజకవర్గానికి 13.89 కోట్లు, వెల్దండ మండలానికి 54 పనులకు గాను రూ.2.80కోట్లు, నూతనంగా ఏర్పడిన గ్రామ పంచాయతీలకు గ్రామ పంచాయతీ భవనాలు మంజూరు చేయించామని, అల్లంతోటబావి, గానుగట్టు, కేస్లీ, కుందారం, ఎంజీ, మర్రిగుంత, నగరగడ్డ,నారాయణపూర్,పల్గుతాండ, పోచమ్మగడ్డ, శంకర్‌కొండ, సిలోనిబావితండా, ఉబ్బలగట్టు తాండకు రూ.20లక్షల చొప్పున మంజూరు చేయడమైందని, సర్పంచ్‌లకు బాధ్యతలు అప్పగిస్తున్నామని, ప్రణాళిక ప్రకారంగా పనులను ప్రారంభించి నాణ్యతగా చేపట్టి పూర్తి చేయాలన్నారు. నూతన గ్రామ పంచాయతీలకు బీటీ రోడ్లకు అనుమతులు వచ్చాయని, త్వరలోనే పనులను ప్రారంభిస్తామన్నారు. ఉమ్మడి మండలానికి భైరాపూర్, తాండ్ర, బొల్లంపల్లి, కొట్ర, కుప్పగండ్ల, పోతేపల్లిల్లో పల్లె దవాఖాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని సదుపాయాలను కల్పించడానికి కృషి చేస్తుందని, సీఎం కేసీఆర్‌తో మరిన్ని నిధులు కేటాయించాలని కోరామని, దినికి సీఎం కేసీఆర్ సానుకూలంగా స్పందించారన్నారు.

**చరిత్ర మార్చేలా ఖమ్మం బహిరంగ సభ:** చరిత్ర మార్చేలా ఖమ్మం బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తెలిపారు. ఖమ్మం బహిరంగ సభ దేశానికి దశ, దిశా నిర్ధేశం ఇవ్వనున్నట్లు, ఈ దేశానికి 3 రాష్ట్రాల ముఖ్యమంత్రులు విచ్చేస్తున్నట్లు తెలిపారు. దేశ ప్రజలనుద్దేశించి సీఎం కేసీఆర్ ప్రసంగించనున్నారని, సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐ రామకృష్ణ, జెడ్పీటీసీ విజితారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు, వెల్దండ గ్రామసర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, ఎంపీడీఓ మోహన్‌లాల్,తహసీల్దార్ చంద్రశేఖర్,వైస్ ఎంపీపీశాంతిగోపాల్‌నాయక్, మాజీ ఎంపీపీ జయప్రకాష్, నాయకులు సంజీవ్‌కుమార్‌యాదవ్, గుత్తి వెంకటయ్య, రామకృష్ణ, శ్రీనునాయక్, శంకర్‌నాయక్, భాస్కర్‌రావు, వెంకటమ్మ, అంజయ్య, శ్రీనివాసులు, భీరయ్య, కాదూరాం, అలీ, బాలలక్ష్మయ్య, ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

# రైతు సంతోషం కోసమే రైతు సంబురాలు

- దేశంలో ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలు అమలు : అలంపూర్ ఎమ్మెల్యే డా.వి.ఎం అబ్రహాం



ఎద్దుల బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

**అలంపూర్, జనవరి 17 ప్రభాతవార్త:** సంక్రాంతి పండగను పురస్కరించుకుని వృషభ రాజులు బలప్రదర్శన (ఎద్దుల బండ లాగుడు) పోటీలను అలంపూర్ ఎమ్మెల్యే డా.వి.ఎం అబ్రహాం పోటీలను ప్రారంభించారు. మంగళవారం అలంపూర్ నియోజకవర్గంలో రాజోలి మండల పరిధిలో మాన్‌దొడ్డి గ్రామంలో శ్రీశ్రీశ్రీ లక్ష్మి మాధవస్వామి జాతర (సంక్రాంతి పండుగ)ను పురస్కరించుకుని వృషభరాజులు బలప్రదర్శన (ఎద్దుల బండ లాగుడు) ప్రారంభోత్సవానికి స్థానిక అలంపూర్ ఎమ్మెల్యే డా.వి.ఎం అబ్రహాం హాజరయ్యారు. ఎద్దుల బండ లాగుడు పోటీలను డా.వి.ఎం అబ్రహాం ఎద్దులకు పూజలు చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు సంతోషం కోసమే రైతు సంబురాలు ఏర్పాటు చేయడం జరిగింది. దేశంలో ఎక్కడాలేని విధంగా రైతులు సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అమలు చేస్తున్న ఘనత సీఎం కెసిఆర్‌కే దక్కిందన్నారు. అన్నదాతల కోసం రైతుబంధు, రైతుభీమా, 24 గంటల కరెంట్, పంటలకు గిట్టుబాటు ధరలు వంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఒకప్పుడు దండగ అనుకునే వ్యవసాయం నేడు తెలంగాణ రాష్ట్రంలో కెసిఆర్ పాలనలో తెలంగాణలో పండగలా మారిందన్నారు. రైతుల కోసం రైతు సంబరాలను గతంలో లాగానే బండ లాగుడు పోటీలను ఈ సంవత్సరం కూడా అంగరంగ వైభవంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. దేవుని ఆశీస్సులతో రాష్ట్రం అలంపూర్ నియోజకవర్గంలోని రైతులకు సకాలంలో వర్షాలు పడాలని రైతులు పండించిన పంటను మంచి గిట్టుబాటు ధర రావాలని ప్రజలందరు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో అష్టైశ్వర్యాలతో నిండు నూరేళ్ల జీవించాలని మనస్ఫూర్తిగా స్వామివారిని కోరుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఆర్‌డిసి ఛైర్మన్ సీతారాంరెడ్డి, వడ్డెపల్లి జడ్పీటిసి కాశపోగు రాజు, స్థానిక సర్పంచ్ సవారి, ఎంపిటిసి మన్సూర్, మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ రఘునందన్‌రెడ్డి, రైతుసంఘం అధ్యక్షుడు తిరుమల, మాజీ సర్పంచ్ నర్సింహాగౌడ్, జేమ్స్, ఆలయ ధర్మకర్త విష్ణువర్ధన్‌రెడ్డి, పరమేష్‌గౌడ్, మాణిక్యం, తిమ్మారెడ్డి, బీమపల్లి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, శారీరక ధారుడ్యాన్ని పెంపొందిస్తాయి



క్రీడాకారులకు బహుమతులను అందజేస్తున్న టిడిపి అచ్చంపేట ఇంఛార్జి మోపతయ్య

**లింగాల, జనవరి 17 ప్రభాతవార్త:** క్రీడలు మానసిక ఉల్లాసాన్ని శారీరక దారుఢ్యాన్ని పెంపొందిస్తాయని టిడిపి అచ్చంపేట ఇంఛార్జి మోపతయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని వల్లభాపూర్ గ్రామంలో కబడ్డి పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. కబడ్డి పోటీల్లో గెలుపొందిన వల్లభాపూర్ గ్రామానికి మొదటి బహుమతి రూ 10,116, లింగాల గ్రామానికి ద్వితీయ బహుమతి రూ. 5116 లు అందజేశారు. ఈసందర్భంగా టిడిపి అచ్చంపేట ఇంఛార్జి మోపతయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ఉన్న క్రీడాకారుల్లో దాగిఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఈ పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. క్రీడాకారులు ఎదగడం కోసం తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. క్రీడారంగానికి టిడిపి హయాంలోనే మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. కబడ్డి నిర్వాహకులు లింగస్వామి, సర్పంచ్ స్వామి, ఉపసర్పంచ్ ధర్మారెడ్డి, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు నిరంజన్,మల్లేష్, వెంకటరమణ,సత్యనారాయణ, మహిపాల్‌రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో వ్యక్తి, మేక మృతి

**లింగాల, జనవరి 17 ప్రభాతవార్త:** విద్యుత్ షాక్‌తో వ్యక్తి, మేక మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని పాత రాయవరం గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి.గ్రామానికి చెందిన కాట్రావత్ (చెంచు) మంతయ్య (55) అనే వ్యక్తి దినసరి మాదిరిగానే మేకల మందను తీసుకుని మేపడానికి వెళ్లాడు. మేకలు మేసుకుంటూ లావుడ్య తౌర్య అనే రైతు వ్యవసాయ పొలంలోకి మేకలు వెళ్లడంతో మేకలను కొట్టుకుని రావడానికి వెళ్లాడు. లావుడ్య తౌర్య అనే రైతు తన పొలం చుట్టు వేరుశనగ పంట రక్షణ కోసం వేసిన కంచెకు విద్యుత్ సరఫరా తీయకపోవడంతో కాట్రావత్ (చెంచు) మంతయ్య, మేక అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎస్సై శ్రీనివాసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుని భార్య ఈశ్వరమ్మ, ఆరుమంది సంతానం ఉన్నారు.

## దళితులపై దాడిచేసిన వ్యక్తులపై హత్య, అట్రాసిటి కేసులు పెట్టాలి

**బిజినేపల్లి, జనవరి 17 ప్రభాతవార్త :** శాయిన్‌పల్లి తండాకు చెందిన గిరిజన బిడ్డ వాల్యానాయక్, బిజినేపల్లి ఉపస్పంచ్ మిద్దె రాములుపై దాడి చేసిన బిఆర్ఎస్ అగ్రవర్ణాలకు చెందిన వైస్ ఎంపిపి చిన్నారెడ్డి, కృష్ణారెడ్డి,తిరుపతిరెడ్డి, స్వామిపై హత్యాయత్నం, ఎస్సీ,ఎస్టీ అట్రాసిటి కేసులు చేసి అరెస్టు చేయాలని మంగళవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీసెల్ అధ్యక్షులు నాగరి గారి ప్రీతం డిమాండ్ చేశారు. మార్కండేయ రిజర్వాయర్ నిర్మాణ స్థలపరిశీలనకు వెళ్లిన మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నాగం జనార్ధన్‌రెడ్డి వెంట ఉన్న దళిత నాయకులపై టిఆర్ఎస్ అగ్రవర్ణ నాయకుల దాడిలో గాయపడిన వాల్యానాయక్‌ను పరామర్శించడానికి మండలంలోని శాయిన్‌పల్లిలోని ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించి మాట్లాడారు. గిరిజనబిడ్డ అయినవాల్యానాయక్‌ను,ఉపస్పంచ్ మిద్దెరాములుపై హత్యాప్రయత్నం చేసిన వారిని ఇప్పటివరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు చేయకపోగా, వాళ్లను అరెస్టు చేయకుండా కాపాడుతున్నందుకు ఈనెల 22న బిజినేపల్లిలో దళిత గిరిజన సభ ద్వారా తేల్చుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట హైదరాబాద్ జిహెచ్ఎంసి అధ్యక్షుడు అచ్యుత రమేష్‌బాబు, మహబూబ్‌నగర్ అధ్యక్షుడు మార్గాల సాయిబాబు, రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ దబ్బేట రమేష్, దళిత మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు భారతి, నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షులు మల్లేపల్లి జగన్, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి భీమనపల్లి శివ, జిహెచ్ఎంసి కన్వీనర్ కమలాకర్, బిజినేపల్లి మండల కాంగ్రెస్ నాయకులు ఉపసర్పంచ్ మిద్దె రాములు, వార్డు మెంబర్ పాషా, మాజీ ఉపసర్పంచ్ కురుమయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెంకటేష్‌గౌడ్, మిద్దెసూరి, మిద్దె మన్నెం, గడ్డమీది కురుమయ్య, పెంటయ్యగౌడ్, బచ్చన్న, డైరెక్టర్ దీప్లనాయక్, బాలస్వామి, మ్యాదరి సత్యం పాల్గొన్నారు.

# కోమటికుంటను ఆక్రమించిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి



వినతి పత్రం సమర్పిస్తున్న రాచాల యుగందర్‌గౌడ్

**పెబ్బేరు, జనవరి 17 ప్రభాతవార్త:** కోమటికుంటను ఆక్రమించిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుని, ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనపరచుకోవాలని బిసి పొలిటికల్ జెఎసి తెలంగాణ రాష్ట్ర చైర్మన్ రాచాల యుగందర్‌గౌడ్ కోరారు. ఈ మేరకు మంగళవారం పెబ్బేరులోని నీటి పారుదలశాఖ కార్యాలయంలో పర్యవేక్షక ఇంజనీరు సత్యశీలరెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వనపర్తి జిల్లా కొత్తకోట పట్టణ శివారు ప్రాంతంలోని బ్రహ్మంగారి ఆలయం వెనకాల సర్వే నంబర్లు 515,487లలో దాదాపు 3 ఎకరాల విస్తీర్ణంలో కోమటికుంట ఉండేదని, ప్రస్తుతం నీటి పారుదల శాఖ రికార్డులో 73 మీటర్ల కట్ట (బండ్) కూడా ఉన్నట్లు వివరాలు నమోదయ్యాయని తెలిపారు. దీనికి 2016 నవంబర్‌లో 225 మీటర్ల కట్టగా బండ్ నిర్మాణాన్ని మిషన్ కాకతీయలో చేపట్టారని, ప్రస్తుతం రియల్ ఎస్టేట్ వ్యాపారులు చుట్టు పక్కల భూములను కొనుగోలు చేసి కుంటలను కలిపేసుకుని వెంచర్లు వేసి అమాయక ప్రజలకు విక్రయిస్తున్నారని అన్నారు. ప్రస్తుతం కోమటికుంట ఎత్తైన కట్టతో పాటు ముందుండే కుంట కూడా కనుమరుగైపోయాయని అన్నారు. ఈ విషయంపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని గతంలో చెప్పినటువంటి అధికారులు 10 నెలలైనా ఎలాంటి చర్యలు తీసుకోకుండా అక్రమార్కులకు కొమ్ము కాస్తున్నారని మండిపడ్డారు. కావున కుంట ఆక్రమణపై విచారణ జరిపించి, అక్రమించిన వారిపై సహకరించిన అధికారులపై చర్యలు తీసుకుని కబ్జాకు గురైన కుంట స్థలాన్ని స్వాధీనపరచుకోవాలని, లేనిపక్షంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

# మానవత్వం చాటిన సాయుధ దళ పోలీసులు



**వనపర్తి, జనవరి 17 ప్రభాతవార్త:** సాయుధ దళ పోలీసు అధికారులు, 1998 పోలీస్ బ్యాచ్‌మిత్రులు మానవత్వంతో తోటిబ్యాచ్ మేట్ కుటుంబానికి అండగా నిలిచి ధైర్యాన్ని ఇవ్వడం ఎంతో అభినందనీయమని జిల్లా ఎస్పీ కె. అపూర్వరావు అన్నారు. మంగళవారం పోలీస్ కార్యాలయంలో 1998 బ్యాచ్‌కు చెందిన, వనపర్తి జిల్లా సాయుధ దళ కార్యాలయంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన టి. శివ కుమార్, (ఎఆర్‌పిసి 2806) కుటుంబానికి వనపర్తి సాయుధదళ పోలీసు అధికారులు, సిబ్బంది, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా 1998 బ్యాచ్ మేట్స్ అందరు మానవత్వంతో స్పందించి అందరు కలిసి నారాయణపేట ఎఆర్‌హెచ్‌సి సాయిలు సహకారంతో సేకరించిన 1 లక్ష రూపాయలను వనపర్తి జిల్లా ఎఆర్ పోలీస్ మిత్రులు అందరు కలిసి సేకరించిన 1 లక్ష రూపాయలను కలిపి 2 లక్షల రూపాయలను వారి భార్య పిల్లలకు అందజేసి మనోధైర్యం కల్పిస్తూ మీకు మేము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ టి.శివకుమార్, కుటుంబానికి తోటి బ్యాచ్ మెట్స్ అందరు మానవత్వంతో కానిస్టేబుల్ కుటుంబానికి అండగా నిలవడం ఎంతో గర్వకారణమని చెప్పరు. పోలీసుల సంక్షేమం కోసం చనిపోయిన పోలీసు కుటుంబాలకు పోలీస్‌శాఖ ద్వారా అందిస్తున్న ఆర్థిక సహకారంతో పాటు బ్యాచ్‌మేట్స్ అందరు కలిసి అండగా నిలిచేలా తీసుకున్న నిర్ణయం చాలా గొప్పదన్నారు. కార్యక్రమంలో సాయుధ దళాధిపతి రిజర్వ్ ఇన్స్‌పెక్టర్ జగన్, హెడ్ కానిస్టేబుళ్లు సుదర్శన్, మొయిన్, నారాయణపేట జిల్లా హెడ్ కానిస్టేబుల్, సాయిలు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించిన బిఆర్ కిశోర్

**అలంపూర్, జనవరి 17 ప్రభాతవార్త :** గతకొన్ని సంవత్సరాలుగా పుల్లూరు టోల్‌ప్లాజాలో విధులు నిర్వహించిన పింజరి సమాదిమియా గుండెపోటుతో మరణించగా టోల్‌ప్లాజా యాజమాన్యం సమాదిమియాకు సరైన న్యాయం చేయకపోగా వీరికి టోల్‌ప్లాజా తరపున ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేశారు. టోల్‌ప్లాజా యాజమాన్యం దిగివచ్చి సమాదిమియా కుటుంబానికి ఆర్థిక సాయం చేయించారు. ఆర్.కిశోర్ సమాదిమియా కుటుంబానికి భరోసాగా నిలిచారు. వీరితోపాటు ఆనంద్,వెంకట్‌రాములు, విజేయ్, పాండు, పీటర్, మద్దయ్య, వెంకటేష్, శేఖర్, మహేష్, రవి, టోల్‌ప్లాజా మిత్రులు తదితరులు ఉన్నారు

# బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

◆ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, జడ్పీ ఛైర్‌పర్సన్ సరిత ◆ శ్రీశ్రీశ్రీ భక్త కనకదాసు నూతన విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే , జడ్పీ ఛైర్‌పర్సన్

**మల్దకల్, జనవరి 17 ప్రభాతవార్త:** గద్వాల నియోజకవర్గం మల్దకల్ మండల కేంద్రంలో భక్త మార్గంలో శ్రీశ్రీశ్రీ భక్త కనకదాసు నూతన భక్త కనకదాసు విగ్రహ ఆవిష్కరణకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, జడ్పీ ఛైర్‌పర్సన్ సరితలు హాజరయ్యారు. ముందుగా శ్రీశ్రీశ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిఆశీస్సులుపొందారు. ఎమ్మెల్యే నూతన కనకదాసు విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాల వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కురువ కులస్తుల, కురువ దోల్లతోఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడు తూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాతనే సీఎం కెసిఆర్ నాయకత్వంలో కుల వృత్తులకు ప్రాధాన్యత రావడం జరిగింది. అన్ని కులాలను గౌరవిస్తూ అన్ని కులాల అభివృద్ధికి అహర్నిశలు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. గతంలో ప్రభుత్వాలు కూడా గొల్ల కురుమలను పట్టించుకున్న పాపాన పోలేదని కేవలం ఓటువేసే యంత్రాలుగా మాత్రమే ఉపయోగించుకున్నారన్నారు.కానీ రాష్ట్రంలో సీఎం కెసిఆర్ గొల్లకురుమ బాధలు తెలిసిన నాయకుడిగా కురువ కులస్తులు అభివృద్ధి చెందాలని గొర్రెలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి, అభివృద్ధికి కృషి చేస్తున్న నాయకుడు సీఎం కెసిఆర్ అన్నారు. జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ జంబు రామన్‌గౌడ్, ఎంపిపి రాజారెడ్డి, కెటిదొడ్డి మండల జడ్పీటిసి రాజశేఖర్, వైస్ ఎంపిపి వీరన్న, ఆలయ ఛైర్మన్ ప్రహ్లాదరావు,సర్పంచ్ యాకోబు,ధరూర్ వైస్‌ఎంపిపి సుదర్శన్‌రెడ్డి,మండలరైతుబంధు సమితి అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు వెంకటన్న, బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు తూంకృష్ణారెడ్డి, నరెందర్, మధు నాయక్, రాముడు, కురుమన్న,చిన్న కృష్ణన్న, కురువ సంఘనాయకులు, కార్యకర్తలు,యూత్ సభ్యులు పాల్గొన్నారు.



శ్రీశ్రీశ్రీ భక్త కనకదాసు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి



ప్రజా ప్రతినిధులతో ఎమ్మెల్యే, జడ్పీ ఛైర్‌పర్సన్

## అందుబాటులో పశుగ్రాసం విత్తనాలు

**కోయిల్‌కొండ, జనవరి 17 ప్రభాతవార్త:** పశుగ్రాసం విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల పశువైద్యాధికారి డా.రేవంత్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పశుగ్రాసం జొన్న విత్తనాలను ప్రభుత్వం 75 శాతం సబ్సిడిపై రైతులకు అందించడం జరుగుతుందని డా.రేవంత్ పేర్కొన్నారు. ఈ విత్తనాలు మండల కేంద్రమైన కోయిల్‌కొండలోని పశువైద్యశాఖ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని పాడిరైతులు, పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

## రక్తదానం చేసిన తీన్మార్ మల్లన్న అభిమానులు



**కోయిల్‌కొండ, జనవరి 17 ప్రభాతవార్త:** తీన్మార్ మల్లన్న జన్మదిన వేడుకల సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం తీన్మార్ మల్లన్న అభిమానులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు.ఈ సందర్భంగా తీన్మార్‌మల్లన్న రాష్ట్ర కమిటి సభ్యుడు ఎం. రాములునాయక్ మాట్లాడుతూ ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తున్న మహానేత తీన్మార్ మల్లన్న అని ఆయన అన్నారు. తీన్మార్ మల్లన్న ఇలాంటి జన్మదిన వేడుకలను మరెన్నో జరుపుకోవాలనిఆయన ఆకాంక్షించారు.ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని భారీ కేక్‌ను కట్‌చేసి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు స్వీట్లు,పండ్లు పంపిణీ చేశారు. రక్తదానం చేసిన వారిలో తీన్మార్ మల్లన్న రాష్ట్ర కమిటి సభ్యుడు ఎం.రాములునాయక్, జిల్లా అధ్యక్షులు ఎ.రవి, నేతలుసంతోష్, మహ మద్ అలీ, శివప్రతాప్, భానుతేజ, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు ఘనంగా స్వాగతం పలికిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



**గద్వాల టౌన్, జనవరి 17 ప్రభాతవార్త:** గద్వాల పట్టణంలో నాటా సేవా వారి ఆధ్వర్యంలో భాగంగా జరుగుతున్న ముఖ్యమంత్రి టి20 జాతీయ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొంటున్నక్రీడాకారులకు గద్వాల జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వీరబాబు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వీరబాబుకునిర్వాహకులుఘనంగా స్వాగతం పలికారు.

## సైన్స్ ఉపాధ్యాయులకు 19న టెలీ కాన్ఫరెన్స్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 17, ప్రభాతవార్త:** ఎస్సీ ఈఆర్టీ ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవం ఫిబ్రవరి 28వ తేదీన పురస్కరించుకొని సైన్స్ ఉపాధ్యాయులు విజ్ఞాన శాస్త్ర బోధనలో నూతన పోకడల అన్వేషణకు, సమర్థవంతంగా బోధించుటకు సమర్పించబోయే సెమినార్ పత్రాలు ఏ విధంగా రాయాలో అనే అంశంపై సైన్స్ ఉపాధ్యాయులకు 19వ తేదీ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు టెలీ కాన్ఫరెన్స్ ఉంటుందని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ గోవిందరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టెలీ కాన్ఫరెన్స్ టీ సాట్ నెట్‌వర్క్ నిపుణ ఛానల్‌లో ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని సైన్స్ ఉపాధ్యాయులందరు ఉపయోగించుకోవాలని డీఈఓ సూచించారు.సైన్స్ ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో సెమినార్ పత్రాలను సమర్పించాలని తెలిపారు.

## గురుకుల నాన్ టీచింగ్ ఔట్ సోర్సింగ్ పోస్టులకు ధరఖాస్తుల ఆహ్వానం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 17, ప్రభాతవార్త:** తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ బాలుర కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, ఉదయం, రాత్రి వేళల్లో వాచ్‌మెన్ పోస్టులకు ఔట్ సోర్సింగ్ పద్దతిన నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన అర్హులైన అభ్యర్థుల నుంచి ధరఖాస్తులు స్వీకరిస్తున్నామని టీటీడబ్ల్యూఆర్ఈఐఎస్ ప్రాంతీయ సమన్వయ అధికారి కే.నాగర్జునరావు ఒక ప్రకటనలో తెలిపారు. రీజినల్ కోఆర్డినేటర్ తిరుమల హీల్స్ అప్పన్నపల్లి మహబూబ్‌నగర్ కార్యాలయం నుంచి ధరఖాస్తు ఫారంను పొంది అర్హత కలిగిన అభ్యర్థులు ధరఖాస్తు ఫారంను పూర్తి చేసి దానికి కావాల్సిన సర్టిఫికెట్స్‌ను జతపరిచి ఈ నెల 24 సాయంత్రం 4 గంటల లోపు సమర్పించాలన్నారు.

## నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 17, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన గ్రూప్ 2,3,4 ఉద్యోగ నియామకాల కొరకు దాదాపు 100 మంది షెడ్యూల్డు కులాల నిరుద్యోగులకు నాన్ రెసిడెన్షియల్ కోచింగ్ మూడు నెలల పాటు ఉచిత ఫ్రీ-ఎగ్జామినేషన్ ఫౌండేషన్ కోర్సు స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు నాగర్‌కర్నూల్ అధికారి తెలిపారు. టీఎస్‌పీఎస్‌సీ ప్రకటించిన అర్హతలు కలిగి ఉండి డిగ్రీలో మెరిట్ మార్కుల ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుందన్నారు. అర్హులైన ఎస్సీ యువత నుంచి ఈ నెల 31వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ధరఖాస్తులు స్వీకరించబడుతాయన్నారు. మరిన్ని వివరాలకు 08540295566కు సంప్రదించాలన్నారు.

## నేడు లక్ష్మీచెన్నకేశవస్వామి లక్షపుష్పార్చన



**దేవరకద్ర,జనవరి 17 ప్రభాతవార్త:** దేవరకద్రలోని శ్రీ లక్ష్మీ లక్ష్మీచెన్నకేశవ స్వామి లక్షపుష్పార్చన పూజా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించనున్నారు. ప్రతి ఏడాది స్వామి వారి లక్షపుష్పార్చన పూజా కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ ఏడాది కూడ స్వామి వారి లక్షపుష్పార్చన పూజా కార్యక్రమానికి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. దేవస్థానంలో ఆ రోజు ఉదయం 11 గంటలకు ఈ పూజా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు తదితర పూజలు నిర్వహించనున్నారు.కావున భక్తులందరూ ఈ పూజా కార్యక్రమానికి అధికసంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులు కావాలని దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్తలు, అర్చకులు, నిర్వాహకులు కోరారు.

## ప్రధానమంత్రి టీ 20 అంతర్జాతీయ క్రికెట్ టోర్నమెంట్

● ముఖ్య అతిథిగా విచ్చేసిన నిజామాబాద్ ఎంపి ధర్మపురి అరవింద్

**గద్వాల టౌన్, జనవరి 17 ప్రభాతవార్త:** గద్వాల జిల్లా కేంద్రంలోని సోమనాద్రి స్టేడియంలో ఎన్ఎటిఎ మురారి వెంకటరమణారెడ్డి, పి. జయ సింహారెడ్డి (సీఎండి తెచ్చింటెలి సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్), మురారి మల్లికార్జునరెడ్డి, డా. మురారి చక్రధర్‌రెడ్డి వారి సహకారంతో నార్త్ అమెరికా తెలుగు అసోసియేషన్ సేవా డేస్ సందర్భంగా ఆజాదికా అమృత్ మహోత్సవంలో భాగంగా అరుణ భరతసింహారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 2023 ప్రైమ్ మినిస్టర్ కప్ టి20 అంతర్జాతీయ క్రికెట్ టోర్నమెంట్‌కు 2వ రోజు ముఖ్య అతిథిగా నిజామాబాద్ ఎంపి ధర్మపురి అరవింద్ వచ్చేశారు. ఈసందర్భంగా ఆయనకు డోలు,డప్పులతో ఘనంగా స్వాగతం పలికారు.అనంతరం ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపి ధర్మపురి అరవింద్ గద్వాల జిల్లా, అనంతపూర్ జిల్లాల ఇరుజట్ల క్రికెట్ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, ఖేలో భారత్ పేరిట క్రీడాకారులను ప్రోత్సహిస్తుందని అన్నారు. కార్యక్రమంలో జోగులాంబ గద్వాల జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కబీర్‌దాసు నర్సింహులు, జిల్లా లీగల్ అడ్వైజర్ నరేందర్‌రెడ్డి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ దిల్లీవాలా క్రిష్ణ, బిజెపి నాయకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపి ధర్మపురి అరవింద్



ఎంపి ధర్మపురి అరవింద్‌కు స్వాగతం పలుకుతున్న దృశ్యం

## బీఆర్‌ఎస్‌తో దేశ రాజకీయాల్లో పెను మార్పులు

● కంటి వెలుగుతో ప్రజల జీవితాల్లో వెలుగులు ప్రసాదిస్తున్న సీఎం కేసీఆర్

● నేటి ఖమ్మం సభను జయప్రదం చేయండి

● బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు గోళి శ్రీనివాస్‌రెడ్డి

**వెల్దండ, జనవరి 17, ప్రభాతవార్త:** సీఎం కేసీఆర్ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల్లో వెలుగులు నిండనున్నాయని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు గోళి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం వెల్దండ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గోళి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కంటి వెలుగు పథకంతో ఎంతో మంది జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. 2018లో ప్రారంభించిన మొదటి విడత కంటి వెలుగుతో ఎంతో మందికి లబ్ధి చేకూరిందన్నారు. బీఆర్‌ఎస్ పార్టీతోనే దేశ రాజకీయాల్లో పెను మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. కేంద్రంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ప్రత్యామ్నాయ శక్తిగా బీఆర్‌ఎస్ అవిర్భవించిం దన్నారు. సీఎం కేసీఆర్ ప్రధానమంత్రి కావడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. బుధవారం ఖమ్మంలో నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ భారీ బహిరంగ సభకు అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సుభాష్, సతీష్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు గోళి శ్రీనివాస్‌రెడ్డి

## జమ్ములమ్మ అమ్మవారిని దర్శించుకున్న మున్సిపల్ ఛైర్మన్

**గద్వాల టౌన్, జనవరి 17 ప్రభాతవార్త :** గద్వాల జిల్లా కేంద్రంలోని నడిగడ్డ ఇలవేల్పు దైవం కొంగు బంగారంగ వెలుగొందుతున్న శ్రీశ్రీశ్రీ జమ్ములమ్మ అమ్మవారు, పరశురామ స్వామి వారిని మున్సిపల్ ఛైర్మన్ బిఎస్ కేశవ్ మంగళవారం దర్శించుకున్నారు. ముందుగా అర్చకులు ఆయనకు స్వాగతం పలికి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేసి, వేద పండితులచే ఆశీర్వాదం పొందారు. ఈసందర్భంగా ఛైర్మన్ కేశవ్ మాట్లాడుతూ నడిగడ్డ ప్రజల ఇలవేల్పు అయిన శ్రీశ్రీశ్రీ జమ్ములమ్మ అమ్మవారి అనుగ్రహంతో పట్టణ ప్రజలు, రైతులు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలన్నారు.పట్టణ ప్రజలు అందరుసుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని అమ్మవారిని మనస్ఫూర్తిగా కోరుకున్నట్లు మున్సిపల్ ఛైర్మన్ కేశవ్ తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ టి.శ్రీను, బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు బి. కోటేష్, రంజిత్, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ ఛైర్మన్‌ను సన్మానిస్తున్న ఆలయ సిబ్బంది

## జోగులాంబ బాలబ్రహ్మేశ్వర దేవస్థాన బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

**అలంపూర్, జనవరి 17 ప్రభాతవార్త :** జోగులాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాలకు శాట్స్ (తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ) ఛైర్మన్ డా. ఆంజనేయగౌడ్‌ను దేవాలయ ఛైర్మన్, ఈఓ ధర్మకర్తల మండలి సభ్యులు, జోగులమ్మ గద్వాల జిల్లా అలంపూర్ 5వ శక్తిపీఠం, దక్షిణ కాశీ, శ్రీశైల పశ్చిమ ద్వారం, శ్రీ జోగులాంబ అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను హైదరాబాద్ రాష్ట్ర శాట్స్ (తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ) కార్యాలయంలో నిర్వహణ కమిటి సభ్యులు, శాట్స్ ఛైర్మన్ డా. ఆంజనేయగౌడ్ అందజేశారు. ఈనెల 22వ తేదీ ఆదివారం నుండి 26వ తేదీ గురువారం వరకు జరిగే మహాశివరాత్రి మహోత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని కోరారు. ఆహ్వానించిన వారిలో దేవస్థాన కమిటి ఛైర్మన్ బి.శ్రీనివాస్‌రెడ్డి,ఈఓ పురెందర్‌కుమార్, ఉషాదేవి, మద్దిలేటి, బోయచిన్న కృష్ణయ్య, జయన్న, నాగబలిమి, హరిబాబు, విష్ణువర్ధన్‌రెడ్డి, నటరాజ్ యాదవ్, కుర్వ గోవర్ధన్, అనంతేశ్వర్‌రెడ్డి, కుర్వదొడ్ల రాముడు, అర్చకులు ఆనంద్‌శర్మ పాల్గొన్నారు.



జోగులాంబ బాలబ్రహ్మేశ్వర బ్రహోత్సవాలకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దృశ్యం

## అనుమతులు లేకుండా నడుపుతున్న కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి

**గద్వాల టౌన్, జనవరి 17 ప్రభాతవార్త:** అనుమతులు లేకుండా జోగులాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా నడుపుతున్న కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని, గద్వాల జిల్లాలో అనుమతులు లేకుండా నడుపుతున్న కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని పిడిఎస్‌యు విద్యార్థి సంఘం డిఈఓకు వినతి పత్రం అందజేశారు. శాంతినగర్, అయిజ, మల్దకల్, గద్వాల ప్రాంతాలలో విద్యార్థుల తల్లిదండ్రుల నుండి సైనిక్ స్కూల్ నవోదయ గురుకుల కోచింగ్ పేర్లతో దాదాపు ఒక్కో విద్యార్థితో 10 వేల నుండి 20 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా కోచింగ్ ఇస్తూ అలాగే జిల్లా విద్యాశాఖ అధికారుల అనుమతి లేకుండా హాస్టల్ వసతి కల్పిస్తూ విద్యార్థులకు సరైన వసతి లేకపోయినా విద్యార్హత లేని వారితో కోచింగ్ ఇప్పిస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల నుండి ముక్కుపిండి ఫీజులు వసూలుచేస్తున్నారన్నారు. అలాంటి కోచింగ్ సెంటర్లపై పూర్తిస్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. కొందరు పాఠశాలలో 5వ తరగతి విద్యార్థులను మాత్రమే పెట్టుకుని కోచింగ్ నడుపుతున్నారు. అనుమతులు లేకుండా నడుపుతున్న కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు.కార్యక్రమంలో పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు హలీమ్‌పాషా,జిల్లాకార్యదర్శి హరీష్, జిల్లా ఉపాధ్యక్షులు శివకుమార్, జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా కోశాధికారి శివ, కార్తీక్, అంజి తదితరులు పాల్గొన్నారు.



## నేటి నుండి రెండోదశ తెలంగాణ కంటి వెలుగు శిబిరాలు ప్రారంభం



కంటివెలుగు కార్యక్రమంపై ప్రజలను చైతన్యం చేస్తున్న బిఆర్‌ఎస్ యువజన నాయకుడు కిశోర్

**అలంపూర్,జనవరి 17 ప్రభాతవార్త :** అలంపూర్ నియోజకవర్గంలోని కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని బిఆర్ ఎస్ పార్టీ యువ నాయకుడు ఆర్. కిశోర్ ఆయా గ్రామాల్లో తిరుగుతూ నియోజకవర్గంలోని కంటి చూపుతో ఇబ్బంది పడుతున్న ప్రతి ఒక్కరిని గ్రామాలలో చైతన్యం చేసి అవగాహన కల్పిస్తూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం కెసిఆర్ చేపట్టిన ప్రతిష్టాత్మ కమైన కంటి వెలుగు ప్రోగ్రాంను అందరు సద్వినియోగపరచుకోవాలని అన్నారు. కంటి చికిత్స కోసం ప్రైవేట్ ఆసుపత్రికి వెళితే ఎంత చిన్న చికిత్స అయినా రూ.10వేల నుండి రూ.30 వేల దాకా ఉందని అంత కంటే ఎక్కువకూడా కావచ్చని ఆయన గ్రామంలో ప్రజలకు సూచించారు. ప్రభుత్వం చేపట్టిన ఉచిత కంటి వెలుగును సద్వినియోగపరచుకోవాలని ఆర్థిక ఇబ్బందులు ఉన్నవారికి సీఎం కెసిఆర్ ఇచ్చిన వరమని ఉచిత కంటి వెలుగులో అందరు పాలు పంచుకుని విజయవంతంచేయాలని కోరుతున్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

**వెల్దండ, జనవరి17 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంలోని జెడ్పీ హెచ్‌ఎస్ పాఠశాలలో 2000-2001లో 10వ తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు మంగళవారం సమావేశం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. విద్యార్థులతో పాఠశాల ఆవరణం మొత్తం కోలాహలంగా మారింది. పూర్వ విద్యార్థులందరు ఒకరికొకరు కలుసుకొని అప్యాయంగా పలుకరించుకొని మాట్లాడారు.చిన్న నాటి జ్ఞాపకాలను నెమరవేసుకొని సంతోషం వ్యక్తం చేశారు.విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీరాములు, లక్ష్మారెడ్డి, వెంకట్‌రెడ్డి, చెన్నయ్య,సుధాకర్, విద్యార్థులు తంబాలు, కోటేశ్వర్, రవీందర్,చంద్రమోహన్, పురుషోత్తమచారి,శ్రీనివాసులు, శశిపాల్‌రెడ్డి, బాలరాజు, దశరథం, మన్సూర్, స్వాతి తదితరులు ఉన్నారు.

## మృతురాలి కుటుంబానికి పరామర్శ



గూరకొండలో మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఆల

**దేవరకద్ర,జనవరి 17 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం గూరకొండలో మంగళవారం మృతురాలి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. గూరకొండలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు వెంకట్రాములు తల్లి అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యేఆల వెంకటేశ్వర్‌రెడ్డిమృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతిరాలి పార్థీవదేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జెట్టి నరసింహ్మారెడ్డి,మాజీ ఆధ్యక్షుడు కుర్వ కెంగూరి శ్రీకాంత్ యాదవ్,నాయకులు కొండారెడ్డి,కొండ భాస్కర్‌రెడ్డిలతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మతసామరస్యానికి ప్రతీక హజ్రత్‌మదారుషా అసహాది దర్గా

- నేటి నుండి చౌదర్‌పల్లిలో ఉర్సు ఉత్సవాలు ప్రారంభం



**దేవరకద్ర,జనవరి17 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం చౌదర్‌పల్లిలో కొలువుదీరిన హజ్రత్ మదారుషా అసహాది దర్గా మతసామరస్యానికి ప్రతీక నిలిచింది. ప్రతి ఏడాది గ్రామ సమీపంలోని హజ్రత్‌మదారుషా అసహాది దర్గా ఉర్సువేడుకలను గ్రామస్థులు కులమతాలకు అతీతంగా ఐక్యమత్యంగా నిర్వహిస్తారు. అందులో భాగంగానే ఈ ఏడాది కూడ ఉర్సు వేడుకలకు గ్రామస్థులు, నిర్వహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ధూలేశ్వర భక్తబృందం, గ్రామ స్థులు,భక్తుల అధ్వర్యంలో ఈ ఉర్సు వేడుకలను నిర వ్రహిస్తారు.ఉర్సు ఉత్సవాలలో మొదటి రోజు ఈ నెల 18న గంధోత్సవం నిర్వహిస్తారు. రాత్రి 11లకు గలీఫా,పూల ఛాదర్‌లచే దర్గాపై కప్పి ప్రత్యేక ఫాతెహాలను నిర్వహిస్తారు. అలాగే ఖవ్వాలి కార్యక్రమాన్ని కూడ నిర్వహిస్తారు. అలాగే 19న ఖతం ఫాతెహా,ఖరాన్ సలాం,శ్రీవారి మహాప్రసాదం,భోజన కార్యక్రమాలను నిర్వహిస్తారు. చౌదర్‌పల్లి,హాజిలాపూర్ గ్రామాల భక్తులచేత ప్రత్యేక భజన కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.ఈ కార్యక్రమంతో ఉర్సు ఉత్సవాలు ముగుస్తాయి.కావున ఈకార్యక్రమానికి భక్తులు అధికసంఖ్యలో హాజరుకావాలని నిర్వహకులు కోరారు.

## మతోన్మాద ఆగడాలను ఎదురించడమే రోహిత్ వేములకు నిజమైన నివాళి

-కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు అంతటి కాశన్న

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 17, ప్రభాతవార్త:** మత్మోనాదుల కుల రక్కసికి బలైన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ రీసర్చ్ స్కాలర్ రోహిత్ వేముల 7వ వర్ధంతి సందర్భంగా కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ కాంప్లెక్ వద్ద రోహిత్ వేముల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా అంతటి కాశన్న మాట్లాడుతూ 2016లో సెంట్రల్ యూనివర్సిటీ వీసీ, ఏబీవీపీ, ఆర్‌ఎస్‌ఎస్‌ల వేధింపుల వల్లనే స్కాలర్ రోహిత్ వేముల ఆత్మహత్య చేసుకున్నారని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగానే విద్యారంగంలో మత భావాలు చొప్పిస్తూ ప్రశ్నించే వారిపైన దాడులు,హత్యలు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లాఉపాధ్యక్షులు వర్ధన్ పర్వతాలు, సీఐటీయూ జిల్లా సహ కార్యదర్శి పొదిలి రామయ్య, ఎమ్ఎస్పీ ఫోరం జిల్లా కార్యదర్శి మోహన్, కేవీపీఎస్ నాయకులు పరుశరాం, బాలస్వామి, రవి, యాదయ్య తదితరులు ఉన్నారు.



## బదిలీలు, ప్రమోషన్లకు ముఖ్యమంత్రి అంగీకారం

-టీఎస్‌యూటీఎఫ్ నాయకుల హర్షం



సమావేశంలో మాట్లాడుతున్న టీఎస్ యూటీఎఫ్ నాయకులు

**వంగూరు, జనవరి 17, ప్రభాతవార్త:** గత ఏడున్నర సంవత్సరాల నుంచి ఉపాధ్యాయులు ఎదురు చూస్తున్న బదిలీలు, ప్రమోషన్లకు సీఎం కేసీఆర్ అంగీకరించడంతో టీఎస్ యూటీఎఫ్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు చిన్నయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు విద్యా సంవత్సరంలో ఎలాంటి నష్టం వాటిల్లకుండా బదిలీలు, ప్రమోషన్లు చేపట్టిన ఏప్రిల్ 22 వరకు పనిచేసి చివరి రోజు రిలీవ్ అయి కొత్త పాఠశాలలో జాయిన్ కావాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని హర్షిస్తున్నామన్నారు. 317 జీవో వల్ల స్థానికతను కోల్పోయిన ఉపాధ్యాయులకు సరైన న్యాయం చేయాలని సీఎంను కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు రామేశ్వరయ్య, లింగమయ్య, వంగూరు మండల కమిటీ అధ్యక్షులు నర్సింహ్మా, ప్రధాన కార్యదర్శి జంగయ్య తదితరులు ఉన్నారు.

## విద్యుత్ ఉద్యోగులకు పీఆర్సీ వెంటనే అమలు చేయాలి



జిల్లా డీఈకి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 17, ప్రభాతవార్త:** విద్యుత్ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు వెంటనే పీఆర్సీని అమలు చేయాలని తెలంగాణ యూనైటెడ్ ఎలక్ట్రిసీటి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని జిల్లా డీఈ టెక్నికల్ అధికారి రవికుమార్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా యూనైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు 2022 ఏప్రిల్ నెల నుంచి రావాల్సిన పీఆర్సీ ఇంత వరకు రాలేదని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఉద్యోగులకు పీఆర్సీని వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పొదిల రామయ్య, యూనియన్ జిల్లా నాయకులు శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

## దళిత టీచర్ మల్లిఖార్జున్‌పై దాడి చేసిన మత్తోన్మాదులను శిక్షించాలి




సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్.శ్రీనివాస్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 17, ప్రభాతవార్త:** నిజామాబాద్ జిల్లా కోటగిరిలో దళిత టీచర్ మల్లిఖార్జున్ కులం పేరుతో దూషిస్తూ బలవంతంగా దేవుడు గుడికి తీసుకెళ్లి బొట్టు పెట్టించి అవమాన పరుస్తూ గ్రామ వీధుల్లో ఊరేగించి అనాగరిక చర్యకు పాల్పడిన ఆర్ఎస్ఎస్, బీజేపీ మతోన్మాద దండుగులను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని గాంధీ విగ్రహం దగ్గర నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులైన మల్లిఖార్జున్ టీచర్‌ను కులం పేరుతో దూషించిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి వదిన రామయ్య, జిల్లా కోశాధికారి నాయకులు హుస్సేన్, ధర్మయ, శివరాం, వెంకటయ్య, మాసన్న, బాలయ్య, వెంకటేష్, రమేష్ తదితరులు ఉన్నారు.

## కోటి సంతకాల సేకరణ కరపత్రాల విడుదల



రామాపురం గ్రామంలో పర్యటిస్తున్న ఆకెపోగు రాంబాబు

**అలంపూర్, జనవరి 17 ప్రభాతవార్త:** బిసి జనాభా గణనపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని బహుజన సమాజ్ పార్టీ నాయకులు ఆకెపోగు రాంబాబు అన్నారు. మంగళవారం ఆయన వడ్డేపల్లి మండల పరిధిలోని రామాపురం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర యూనిట్ ఆదేశాల ప్రకారం కోటి సంతకాల సేకరణ కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకు బిసి జనాభా గణన చేయడం లేదన్నారు. ప్రతి సంవత్సరం జంతువులను, పశువులను లెక్కించే ప్రభుత్వాలు దేశం, రాష్ట్రంలో ఎంతమంది బిసిలు ఉన్నారో వారి జనాభా లెక్కలను ఎందుకు చేయడం లేదో అని ప్రశ్నించారు. ప్రభుత్వాలు నిర్లక్ష్య పూరిత విధానాలను విడనాడి తక్షణమే బిసి జనాభా గణనను చేపట్టాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా బిసిలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించే విధంగా కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో చట్టాన్ని తీసుకుని రావాలన్నారు. జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లను పెంచాలన్నారు. చర్యలు చేపట్టలేని పక్షంలో భవిష్యత్ ప్రణాళిక ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో వెంకట్‌రాములు తదితరులు పాల్గొన్నారు.

## బూత్ కమిటీ ప్రముఖ్‌ల నియామకం

**ధరూర్, జనవరి 17 ప్రభాతవార్త:** బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణమ్మ సూచన మేరకు మండలంలో మంగళవార 25వ బూత్ నంబర్ కోతులగిద్ద గ్రామం 56వ నంబర్ జాంపల్లి, 63 నంబర్ మన్నాపురం గ్రామం 22,23,24 నంబర్, గ్రామంలో బూత్ కమిటీ, ప్రముఖ్‌లను నియమించారు. ఈ కమిటి సమావేశానికి ముఖ్య అతిథిగా బిజెపి జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి రావడం జరిగింది. కమిటీల పత్రాలను ఆయనకు అందజేయడం జరిగింది. జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ బూత్ కమిటీలు ప్రముఖ్‌లు బూత్‌స్థాయి నుంచి భారతీయ జనతా పార్టీని బలోపేతం చేయాలని డికె అరుణమ్మను భారీ మెజార్టీతో గెలిపించే పనిలో నిమగ్నం కావాలని పిలుపునిచ్చారు. కరోనా మహమ్మారి నుంచి దేశ ప్రజలను కాపాడి,అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం యూరియా,డిఎపి పొటాష్‌పై సబ్సిడిఇచ్చిన ఘనతనరెంద్రమోడీదేనని తెలియజేశారు. కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు మీర్జాపురం రామచంద్రరెడ్డి, కిష్టన్న, సంజీవ్, భరద్వాజ్, రాజశేఖర్, సురేష్, కాపుల కుంట శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# అంధత్వ నివారణకు కంటి వెలుగు

**- సమన్వయంతో పనిచేయాలి: నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్**

**వంగూరు, జనవరి 17, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమంతో అంధత్వాన్ని నివారించవచ్చునని, అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం అచ్చంపేట పట్టణంలోని పటేల్ ఫంక్షన్‌హాల్‌లో రెవెన్యూ డివిజన్ పరిధిలో నిర్వహించనున్న కంటి వెలుగు బృందాలు, ఆయా శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి వైద్య శిబిరానికి అవసరమైన మౌళిక వసతులు ఏర్పాట్లు చేసి కంటి పరీక్ష యంత్రాలు అన్ని ఉన్నాయా లేవా చూసుకోవాలన్నారు. డివిజన్ పరిధిలోని 205 ప్రాంతాలను ఏర్పాటు చేసి 17 బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఏబృందం ఎక్కడ పనిచేయాలో ప్రణాళికసిద్ధం చేయాలన్నారు. ప్రజలకు ప్రణాళికను స్పష్టంగా తెలిపే విధంగా చూడాలని ఆయన అన్నారు. పంచాయతీ రాజ్, ఆరోగ్య శాఖ, రెవెన్యూ శాఖ సమన్వయంతో పాటు ప్రజా ప్రతినిధులను కలుపుకొని కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మనుచౌదరి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి సుధాకర్‌లాల్, డీపీఓ కృష్ణ, ఆర్డీఓ పాండునాయక్, మున్సిపల్ కమీషనర్ బాల్‌రాం, డిప్యూటీ డీఎంహెచ్ఓ తారాసింగ్, అప్తలామాలజీలు, ఆయా శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.



క్షబృందాలకు సిమ్‌కార్డులు అందజేస్తున్న కలెక్టర్

## జంతు సంక్షేమం ప్రతి పౌరుడి బాధ్యత: నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 17 ప్రభాతవార్త:** జంతు సంక్షేమం ప్రతి పౌరుడి బాధ్యత అని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ పేర్కొన్నారు. జంతు సంక్షేమ చట్టాలను విధిగా పాటించాలన్నారు. జంతు సంక్షేమం కోసం ప్రజలు పాటించాల్సిన నిబంధనలు అనే కరపత్రాన్ని విడుదల చేసి ప్రజలు పాటించాల్సిన నిబంధనలను వివరించారు. వీధుల్లో తిరిగే కుక్కలు, పిల్లులు, ఆవులు తదితర జంతువుల పట్ల కరుణతో వ్యవహరించాలని, వాటికి ఆహారం, తాగునీరు అందించాలి కానీ హింసకు గురి చేయరాదన్నారు. పక్షులు నివసించే ఆవాసాలైన వృక్షాలను నరికివేయరాదని, అవి నివసించే ప్రాంతాల్లో గాలి పటాలు ఎగురవేయరాదని,వాటికి ఉన్న దారాల ద్వారా పక్షులు మృత్యువాత పడుతాయన్నారు. ప్రతి పౌరుడు జంతు హింస చేయరాదని, జంతువుల పట్ల కరుణతో ఉండి వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పశువైద్య మరియు పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ జీ.వి.రమేష్, జెడ్పీ సీఈఓ ఉష, డీఆర్‌డీఏ పీడీ నర్సింగ్‌రావు, అడిషనల్ పీడీ రాజేశ్వరి తదితరులు ఉన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

- కౌకుంట్ల క్రికెట్ జట్టుకు వరించిన విజయం
- రన్నర్‌గా పెద్దమందడి జట్టు
- క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులను అందజేసిన నేతలు

**దేవరకద్ర,జనవరి 17 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం కౌకుంట్లలో నిర్వహించిన దివంగత ఉపాధ్యాయుడు బేరి నాగేందర్ ఉమ్మడి జిల్లా స్థాయి స్మారక క్రికెట్ టోర్నమెంట్‌లో మంగళవారం జరిగిన సెమీఫైనల్ హోరాహోరి పోరులో విజయం కౌకుంట్ల క్రికెట్ జట్టుకు వరించింది. రన్నర్‌గా పెద్దమందడి జట్టు నిలిచింది.కౌకుంట్లలో గ్రామానికి చెందిన దివంగత ఉపాధ్యాయుడు బేరి నాగేందర్ స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో వివిధ మండలాలకు చెందిన దాదాపు 36 క్రికెట్ జట్లు పాల్గొన్నాయి. అయితే చివరి రోజు కౌకుంట్ల,పెద్దమందడి జట్లు హోరాహోరిగా తలపడ్డాయి. చివరకు కౌకుంట్ల జట్టు విజయం సాధించింది.

**-విన్నర్ జట్టుకు రూ.50వేలు,రన్నర్ జట్టుకు రూ.25వేలు..**

దేవరకద్ర మండలం కౌకుంట్లలో నిర్వహించిన దివంగత ఉపాధ్యాయుడు బేరి నాగేందర్ స్మారక క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన వేజేతలకు షీల్డ్‌లతో పాటు నగదు బహుమతులను అందజేశారు. విన్నర్ జట్టుకు గ్రామానికి చెందిన ప్రముఖ సామాజిక వేత్త పవన్ కుమార్‌యాదవ్ రూ.50వేల నగదును అందజేశారు. అలాగే రన్నర్ జట్టుకు గ్రామా సర్పంచ్ స్వప్నకిషన్‌రావు రూ.25వేల నగదును అందజేశారు. అయితే దాదాపు 10 రోజుల పాటు జరిగిన టోర్నమెంట్‌లో క్రీడాకారులకు గ్రామానికి చెందిన సామాజికవేత్త జహంగీర్ భోజనవసతి కల్పించారు.ఈ టోర్నమెంట్‌కు గ్రామస్థులు ఐక్యమత్యంగా సంపూర్ణ సహకారం అందించారు. ఈ బహుమతుల కార్యక్రమంలో దేవరకద్ర వ్యవసాయమార్కెట్ మాజీ చైర్మెన్ అరవింద్‌కుమార్‌రెడ్డి,యంపీటీసీ కిష్టన్న,సర్పంచ్ స్వప్న కిషన్‌రావు, నాయకులు శ్రీకాంత్,తుమ్మల శేఖర్‌రెడ్డి,నరసింహ్మలు, గుముడాల రవి,శివ ఉమార్, రాఘవేందర్‌రెడ్డి,కిరణ్‌కుమార్‌రెడ్డి, రామకృష్ణ, సర్పంచులు శివరాజ్,శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ప్రసంగించారు.



విన్నర్ జట్టుకు నగదు బహుమతిని అందజేస్తున్న పవన్‌కుమార్‌యాదవ్



కౌకుంట్లలో రన్నర్ జట్టుకు నగదు బహుమతిని అందజేస్తున్న కిషన్‌రావు

**క్రీడలతో మానసిక ఉల్లాసం: మదుసూధన్‌రెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు...** క్రీడలతో మానసిక ఉల్లాసం అభిస్తుందని మహబూబ్‌నగర్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు మదుసూధన్‌రెడ్డి అన్నారు.దేవరకద్ర మండలం కౌకుంట్లలో మంగళవారం నిర్వహించిన దివంగత ఉపాధ్యాయుడు బేరి నాగేందర్ ఉమ్మడి జిల్లా స్థాయి స్మారక క్రికెట్ టోర్నమెంట్ విజేతల బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి మదుసూధన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. శారీరక దేహధారుఢ్యానికి క్రీడలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. అందుకే క్రీడలకు ప్రతి ఒక్కరు అధిక ప్రధాన్యత ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా గెలుపొందిన క్రీడాకారులకు మదుసూధన్‌రెడ్డి అభినందించారు.

# క్రీడల్లో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలి

**● క్రీడలు స్నేహ బంధాన్ని పెంచుతాయి : వెల్దండ సీఐ రామకృష్ణ**

**వెల్దండ, జనవరి 17, ప్రభాతవార్త:** క్రీడల్లో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించినప్పుడే నిజమైన క్రీడాకారులుగా రాణించగలుగుతారని వెల్దండ సీఐ రామకృష్ణ అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే క్రీడలు స్నేహబంధాన్ని పెంచుతాయని ఆయన అన్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని వెల్దండ మండల కేంద్రంలోని రిక్రియేషన్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి సీఐ రామకృష్ణ, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు, వెల్దండ గ్రామ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ, రిక్రియేషన్ క్లబ్ అధ్యక్షులు సంజీవ్‌కుమార్‌యాదవ్‌లు హజరై విజేతలకు నగదు ప్రోత్సాహకంతో పాటు షీల్డ్ బహుమతులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధృడత్వాన్ని పెంపొందిస్తాయన్నారు. క్రీడల్లో గెలుపోటములు సమానంగా తీసుకోవాలని క్రీడాకారులకు సూచించారు. ఓటమి గెలుపుకు నాంది అని, ప్రతి క్రీడాకారుడు ఓటమి చెందితే నిరుత్సాహ పడవద్దని, భవిష్యత్తులో ఎన్నో విజయాలు సాధించేందుకు అవకాశాలు కలిసి వస్తాయని భావించి క్రీడాకారులతో స్నేహ పూర్వకంగా కలిసి మెలిసి ఉండాలన్నారు. క్రీడల వల్ల ఎక్కడో ఉన్న వ్యక్తులతో పరిచయాలు ఏర్పడి స్నేహబంధాలు ధృడంగా మారి ఎన్నో అవకాశాలు కలిసి వస్తాయని, వాటితో అభివృద్ధి చెందేందుకు కూడా ఉపయోగపడుతాయని ఆయన పేర్కొన్నారు. గ్రామీణ క్రీడలను పెంపొందించేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులకు, గ్రామ యువకులకు పోత్సాహం కల్పించి క్రీడలను మరుగున పడకుండా అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ఎంతైన ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాస్, స్పోర్ట్స్ నిర్వాహకులు విజయేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి భరతయ్య, ఉప సర్పంచ్ జంగిలి నిరంజన్, సభ్యులు మోహన్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, వజ్రలింగం, సత్యం, చక్రవర్తిగౌడ్, నిరంజన్, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఉప్పు ఆంజనేయులు, కృష్ణారెడ్డి, వెంకటరమణారెడ్డి, పురుషోత్తంరెడ్డి, పుష్పగిరిరావు, అలీ, వజ్రలింగం, భీరయ్య, చంద్రశేఖర్, యాదగిరి, శ్రీశైలం, శ్రీనివాస్‌గౌడ్, నారాయణనాయక్ తదితరులు ఉన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

# దేవరకద్ర నియోజకవర్గంలో బిజెపి జెండా ఎగురవేయాలి

- **బిజెపి నాయకులు డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి, ఎగ్గని నరసింహులు**
- **కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల నుండి 50 మంది బిజెపిలో చేరిక**

**మూసాపేట, జనవరి 17 ప్రభాతవార్త:** మూసాపేట మండల పరిధిలోని జానంపేట గ్రామంలో బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నుండి దాదాపు 50 మంది మండల పార్టీ అధ్యక్షుడు రవిందర్‌గౌడ్ గ్రామానికి చెందిన పల్లె సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో బిజెపి రాష్ట్ర నాయకులు సుదర్శన్‌రెడ్డి, డోకూర్ పవన్ కుమార్‌రెడ్డి, ఎగ్గని నరసింహులు సమక్షంలో బిజెపి పార్టీలో చేరారు. అంతకు ముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రామంలో బిజెపి పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ కన్వీనర్ డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పెద్ద ఎత్తున జానంపేట గ్రామం నుండి బిజెపి పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అన్నారు. ఈ చేరికలు జానంపేట గ్రామంనుంచి మొదలై నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో పెద్ద ఎత్తున పార్టీలో చేర్పించాలని తెలిపారు. బిజెపి పార్టీని గ్రామస్థాయి నుండి బలోపేతం చేయాలని రానున్న రోజుల్లో దేవరకద్ర గడ్డ బిజెపి అడ్డాగా ఉండాలని దేవరకద్ర నియోజకవర్గంలో బిజెపి జెండా ఎగురవేయాలని తెలిపారు. వచ్చే ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వమేనని తెలిపారు. టిఆర్ఎస్ పార్టీ రోజు రోజుకు దిగజారుడు రాజకీయాలు చేస్తుందని అవినీతికి టిఆర్ఎస్ పార్టీ నాయకులు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచారని తెలిపారు. అధికారంలోకి వచ్చి 9ఏళ్ల గడిచినా ఇంతవరకు రైతులకు రుణమాఫి చేయలేదని, ఇంటికో ఉద్యోగం ఇస్తానని తన ఇంట్లోనే నలుగురికి పదవులు ఇప్పించాడని అన్నారు. గ్రామాల్లో వేసిన ప్రతి సిసి రోడ్డు కేంద్ర ప్రభుత్వ నిధులతోనే వేశారని రాష్ట్ర ప్రభుత్వ పథకాల్లో కేంద్ర ప్రభుత్వ వాటా ఉందని తెలిపారు. ప్రతి గ్రామంలో డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మిస్తానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే నియోజకవర్గంలో కొన్ని గ్రామాలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లను పరిమితం చేశారని తెలిపారు. కార్యక్రమంలో పాలమూరులో పార్లమెంట్ కన్వీనర్ డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు సుదర్శన్‌రెడ్డి, ఎగ్గని నర్సింలు, మాజీ జడ్పీటిసి బాలనరసింహులు, మండల అధ్యక్షుడు రవిందర్‌గౌడ్, తిరుపతిరెడ్డి, కొండారెడ్డి, జనార్ధన్‌రెడ్డి, దేవేందర్‌రావు, సూర్యప్రకాష్,పల్లి నాగరాజు, పెద్ద నరసింహులు, చిన్ననరసింహులు, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.



బిజెపిలో చేరిన వివిధ పార్టీల నాయకులు

# భూమితో సంబంధం లేకుండా పెన్షన్‌లు మంజూరు చేయాలి

**● బీఎస్పీ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంబాబు**

**ఇటిక్యాల, జనవరి 17 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులు, వితంతువులకు పెన్షన్‌లు మంజూరు చేయక ఇబ్బందులకు గురి చేస్తుందని పొలం ఎక్కువ ఉందని, నాలుగు చక్రాల వాహనాలు ఉన్నాయని లేనిపోని నిబంధనలు పెట్టి వృద్ధులకు పింఛన్లను ప్రభుత్వం మంజూరు చేయడం లేదని పెండింగ్‌లో ఉన్న పింఛన్లు వెంటనే ప్రభుత్వం మంజూరు చేయాలని బీఎస్పీ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని మునగాల, నక్కలపల్లి గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు వృద్ధులు, వితంతువులు వారికి ప్రభుత్వం నుండి పింఛన్లు రావడం లేదని కఠినమైన నిబంధనలను రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చి తమకు పెన్షన్లను జారీ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ సమస్యలను తమ దృష్టికి తెచ్చారని బీఎస్పీ పార్టీ నాయకులు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ భూమితో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి ఆసరా పెన్షన్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కఠినమైన నిబంధనలను ప్రభుత్వం తొలగించాలన్నారు. ఆయన వెంట బీఎస్పీ సీనియర్ నాయకులు చిన్న నారాయణ పాల్గొన్నారు.



మునగాలలో మహిళలతో మాట్లాడుతున్న బీఎస్పీ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంబాబు